# మాయలేడి

**మేం** రెండు రోజుల్లో వెళ్ళబోయే నాగార్జునసాగర్ టూర్ గురించి మాట్లాడుకోవటానికి ఆ రోజు సాయంకాలం శ్రీశీరామ్ ఇంట్లో అందరం కలవాలని అనుకున్నాం. మా అందరి ఆఫీసులకూ శ్రీశీరామ్ ఇల్లే కొంచెం దగ్గిర.

నేనూ, వర్మ, గోపాల్, శ్రీశీరామ్... నలుగురం హైస్కూలు రోజుల నుండీ స్నేహితులం. మా చదువులు ఇక్కడే హైద్రాబాద్‌లోనే పూర్తయ్యాయి. ఉద్యోగాలూ ఇక్కడే దొరకటంతో అందరం తరచూ కలుసుకుంటుంటాం.

ఒక సంవత్సరం క్రితమే మాకు సుధాకర్‌తో స్నేహం కలిసింది. ఒక ఆదివారం మేం నలుగురం గోపాల్ ఇంట్లో కార్డ్స్ ఆడుకుంటున్నప్పుడు... అంతకు నెలరోజుల క్రితమే ఎదురింట్లో అద్దెకు దిగిన సుధాకర్ వచ్చి పరిచయం చేసుకున్నాడు. అతను కాలేజీలో లెక్చరర్‌గా జాబ్ చేస్తున్నాడు.

కాఫీలవీ అయ్యాక అతను మా నలుగురివేపూ చూస్తూ "మీరు ఏమీ అనుకోనంటే... మిమ్మల్ని ఒకటి అడుగుతాను. ఇప్పుడు మీకున్న చెడ్డపేరును పోగొట్టి మంచిపేరును తెచ్చే అవకాశం నాకివ్వగలరా?" అన్నాడు.

మాకేమీ అర్థం కాలేదు. "అదేమిటీ...?" అన్నాం అందరం ఆశ్చర్యంగా ఒక్కసారే.

అప్పుడు చిరునవ్వుతో "ఎవరైనా నలుగురు గ్రూప్‌గా ఉంటే 'దుష్టచతుష్టయం' అనీ. అదే అయిదుగురయితే 'పంచపాండవుల'నీ అంటుంటారుగా... నన్నూ మీ గ్రూపులో చేర్చుకుంటే. నేను పంచపాండవులనే మంచిపేరు తెచ్చినట్లేగా...!" అన్నాడు.

అతను సరదాగా చెప్పిన ఆ మాటలకు అందరం పెద్దగా నవ్వాం.

మేం నలుగురం కలిసి సరదాగా తిరగటాన్ని గమనించిన అతనికి మాతో స్నేహం చేయాలనే కోరిక కలిగిందట. మేం ఆనందంగా స్వాగతం చెప్పాం. అప్పటి నుంచీ సుధాకర్ కూడా మాతో కలుస్తుంటాడు. అప్పుడప్పుడూ పిక్నిక్‌లకి వెళ్ళే ప్రోగ్రామ్‌లను అతనే పెడుతుంటాడు. సరదామనిషి. కబుర్లు బాగా చెబుతాడు.

నేను శ్రీశీరామ్ ఇంటికి వెళ్ళేసరికి గోపాల్ తప్ప మిగతావాళ్ళు అందరూ ఉన్నారక్కడ. రెండు నిముషాల్లోనే గోపాల్ కూడా వచ్చాడు.

"సారీ... నేను నాగార్జున సాగర్ రావటానికి వీలుపడదు. నాన్నగారు ఈ శని, ఆదివారాల్లో ఇంటికి రమ్మని ఫోను చేశారు. వైజాగ్ వెళ్ళాలి" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ ఎందుకో నిరుత్సాహంగా ఉన్నాడు.

"వీలుకాకపోతే మానేద్దాం. సరదాగా పెట్టుకున్న ప్రయాణమేగా. ఇంకోసారి వెళ్ళొచ్చు. నిన్ను వెంటనే రమ్మన్నారంటే ఏమైనా సీరియస్ ప్రోబ్లమా...?" వర్మ అడిగాడు.

గోపాల్ నిట్టూర్చాడు. "మా చెల్లెలు వనజకి కిందటి సంవత్సరమే పెళ్లి అయిందని తెలుసుగా. అదేమిటో అప్పుడే వాళ్ళ మధ్య ఏవో గొడవలు. మా బావ కిషోర్‌కి క్యాంపులు ఎక్కువగా ఉంటాయి. అతనికి అమ్మాయిలతో స్నేహాలెక్కువని మా వనజకి అనుమానమనుకుంటా. ఒకసారి గొడవపడి వచ్చేస్తే, సర్దిచెప్పి పంపించాం. ఇప్పుడు మళ్ళీ వచ్చి విడాకులు తీసుకుంటానని అంటోందట. ఏం చేయాలో ఆలోచించటానికి నాన్నగారు నన్ను రమ్మన్నారు."

"మునుపటి రోజుల్లోలాగా అమ్మాయిలు ఎలాంటి సమస్యలనైనా సహించి ఊరుకోవటం లేదు మరి. ధైర్యంగా విడాకులు తీసుకోవటానికి సిద్ధపడుతున్నారు. మంచిదే" అన్నాడు శ్రీశీరామ్.

"తగినంత కారణమున్నప్పుడు విడాకులు తీసుకోవటంలో తప్పులేదు. కానీ... ఒక్కోసారి కేవలం అపోహలూ, అపార్థాలే చాలా సమస్యలకి కారణమవుతుంటాయి. అలాంటప్పుడు మనసువిప్పి మాట్లాడుకొంటేనే సమస్యలు సర్దుకుంటాయి. చాలా మంది అలా చేయకుండా మనసులో ఏవో అనుమానాలు పెట్టుకుని పైకి చెప్పకుండా గొడవలను పెంచుకుంటారు. తీరా చూస్తే... వడ్లగింజలో బియ్యపుగింజలా సమస్యేమీ ఉండదు. మా చిన్నాన్నగారి అమ్మాయి లావణ్య విషయంలో అలానే జరిగింది" అన్నాడు సుధాకర్. ఎందుకో గానీ అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

సుధాకర్ మాకు కథ చెప్పబోతున్నాడని అర్థమైంది. తన అనుభవాలను కథలుగా చెప్పటం అతనికి అలవాటు. అతను చెప్పే కథలను వినటం మాకూ ఇష్టమైన కాలక్షేపమే! "ఇంకెందుకూ ఆలస్యం... ఆ లావణ్య కథ ఏమిటో మొదలు పెట్టు మరి!" అన్నాను. సుధాకర్ చెప్పటం మొదలు పెట్టాడు.

* * * * *

నా ఫ్రెండు మహేష్ నాలుగేళ్లు స్టేట్స్‌లో ఉండి వచ్చాక, ఇక్కడ హైద్రాబాద్‌లో సొంతంగా ఇన్‌స్టిట్యూట్ పెట్టాడు. అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జాబ్‌చేసి బాగా సంపాదించాడు. ఒక సారి మా ఇంటికి డిన్నర్‌కి వచ్చినప్పుడు, టీపాయ్ మీదున్న ఫోటో ఆల్బమ్‌ని తిరగేస్తూ మా చిన్నాన్నగారి అమ్మాయి లావణ్య ఫోటో చూసి ఎవరని వివరాలడిగాడు. కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తి చేసిందనీ, జాబ్ కోసం చూస్తోందనీ చెప్పాను.

నేను ఎందుకో లోపలకు వెళ్లి మళ్ళీ వచ్చే వరకూ వాడు లావణ్య ఫోటోనే చూస్తోంటే... "అమ్మాయి అంత బాగా నచ్చిందా? పెళ్ళిచూపులు ఏర్పాటు చేయమంటావా?" అనడిగాను తమాషాకి.

మహేష్ ఏం మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాడు. కానీ మరునాడు ఫోను. "నువ్వు తమాషాకి అన్నావేమో గానీ నేనీ విషయం సీరియస్‌గానే ఆలోచించాను. వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడతావా?" అనడిగాడు. ఇంకో రెండు సంవత్సరాల వరకూ పెళ్లిమాట తలపెట్టకూడదని నిర్ణయించుకున్న వాడి అభిప్రాయం లావణ్య ఫోటో చూడగానే మారిపోయిందని చెప్పాడు. "లావణ్య కూడా జాబ్‌లో చేరిన రెండు సంవత్సరాల తరవాతనే పెళ్ళి అని ఇంట్లో చెప్పింది. పెళ్ళిచూపుల్లో నిన్ను చూస్తే, తన అభిప్రాయమూ మారిపోతుందేమోలే" అంటూ నవ్వాను. దానికి వాడు "నాకిపుడే ఒక ఆలోచన వచ్చింది. మా ఇన్‌స్టిట్యూట్‌లోనే లావణ్యకి జాబ్ ఇద్దాం. ఒక వారం పదిరోజుల తరవాత నేనే తన అభిప్రాయం అడిగి తెలుసుకుంటాను. అప్పుడు పెద్దవాళ్ళతో మాట్లాడటం బావుంటుందేమో! ఏమంటావు…?" అన్నాడు.

"అందరికీ పెళ్ళిచూపుల టైము గంటో, అరగంటో ఉంటుంది. నీకేమో వారం పదిరోజులన్నమాట! సరే, అలాగే చేయి." అన్నాను నవ్వుతూ.

☆ ☆ ☆ ☆ ☆

మేం అనుకున్న ప్రకారం ఆ మరునాడు లావణ్య వాళ్లింటికి వెళ్ళి జాబ్ విషయం చెప్పాను. "ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్ అన్నారు. నువ్వు కొంచెం బాగా రెడీ అయితే, ఇప్పుడే వెళ్దాం" అన్నాను. "మనం వెళ్తోంది ఇంటర్వ్యూకేగానీ పెళ్లిచూపులకి కాదు బాబూ" అంటూ సింపుల్‌గా పంజాబీ డ్రెస్సులోనే తయారైంది.

'పెళ్ళిచూపులన్న సంగతి నాకు కదా తెలుసు' మనసులోనే అనుకుని నవ్వుకున్నాను. మంచి సిల్కుచీరె కట్టుకోమని చెబుదామనుకున్న నా ఆలోచనను విరమించుకున్నాను. కొన్ని విషయాల్లో లావణ్య తన పద్ధతి ప్రకారమే పోతుంది, కానీ ఎవరిమాటా వినదని తెలుసు మరి.

పేరుకే ఇంటర్వ్యూ కాబట్టి మహేష్ లావణ్యని వెంటనే జాబ్‌లో చేరిపోవచ్చని చెప్పాడు. లావణ్య చాలా ఆనందంగా అంగీకరించింది.

వారం రోజుల తరవాత నేను ఫోన్ చేద్దామని అనుకుంటుండగా మహేష్ చేశాడు. పెళ్ళి గురించి మహేష్ అడిగితే, లావణ్య ఆ సాయంకాలం మమ్మల్నిద్దర్నీ వాళ్ళింటికి రమ్మని చెప్పిందట. చిన్నాన్న, పిన్ని కూడా మహేష్‌ని చూడాలి కాబట్టి ఇంటికి రమ్మని పిలిచి ఉంటుందని అనుకున్నాను. మహేష్, లావణ్య అన్ని విషయాల్లోనూ సరిజోడీగా ఉంటారు. వేలెత్తి చూపటానికి ఏలోపమూ లేని చక్కని జంట అవుతారు వాళ్ల పెళ్లి జరిగితే. పెద్దవాళ్లు ఏ అభ్యంతరం చెప్పకుండా ఆనందంగా అంగీకరిస్తారనే నా నమ్మకం.

పెద్దవాళ్ళతో పరిచయాలయ్యాక లావణ్య, మహేష్ కాసేపు మాట్లాడుకున్నారు. మేం ఇంటికి వచ్చేస్తున్నప్పుడు "లావణ్య తన అంగీకారం చెప్పిందా?" అని మహేష్‌ని అడిగాను.

"నేను తనకి రెండు హామీలను ఇవ్వగలిగితే తనకి అంగీకారమేనని చెప్పింది. నేను వెంటనే హామీలు ఇచ్చేశాను" అన్నాడు మహేష్ నవ్వుమొహంతో.

"ఏమిటవీ?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆడ, మగ మధ్య ఉండే స్నేహాలకి తప్పనిసరిగా కొన్ని పరిమితులూ, హద్దులూ ఉండాలని తన అభిప్రాయమట. తనకీ ఇద్దరు ముగ్గురు అబ్బాయిలతో స్నేహం ఉంది. ఏదైనా పని ఉంటే ఇంటికి వచ్చి మాట్లాడతారు. అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుంటారు. అంతవరకేగానీ ఎప్పుడూ సినిమాలకీ,

షికార్లకీ కలిసి తిరిగే అలవాటు లేదట. అలాగే నాక్కూడా ఎవరైనా అమ్మాయిలతో స్నేహాలుంటే, నేనూ హద్దుల్ని అతిక్రమించననే హామీ ఇవ్వాలట. నా సంగతి నీకూ తెలుసుగా... నాకసలు గర్ల్‌ఫ్రెండ్స్ అంటూ లేనేలేరు. ఇక హద్దులూ, పరిమితులూ అనే సమస్య ఏముందీ...! అందుకే వెంటనే ఒప్పుకున్నాను అలాగేనని" అన్నాడు.

"ఆ మధ్య మా బంధువుల్లో ఒకమ్మాయి విడాకులు తీసుకుంది. భర్తకున్న ఆడపిల్లల స్నేహాలను భరించలేకే విడాకులు తీసుకున్నానని చెప్పింది. అందుకే లావణ్య ముందు జాగ్రత్తగా మహేష్ దగ్గర్నుంచి అలాంటి హామీ తీసుకోవాలని అనుకుంది కాబోలు! ఆ మాటే మహేష్‌కి చెప్పి 'తన పిచ్చిగానీ హామీ ఇచ్చి నిలబెట్టుకోకపోతే, ఏం చేయగలదటా.. ఇంతకీ రెండో హామీ ఏమిటి...?" అన్నాను.

మహేష్ నవ్వుతూ... "మొదటి హామీని నిలబెట్టుకోలేకపోతే నిజాయతీగా ఆ విషయాన్ని ఒప్పుకోవడమనేది రెండో హామీ" అన్నాడు.

నాకూ నవ్వొచ్చింది.

★ ★ ★ ★ ★

పెద్దవాళ్లు అందరూ కలిసి మాట్లాడుకోవటం, ముహూర్తాలు నిర్ణయించటం చకచకా జరిగిపోయాయి. ఇరువైపుల వాళ్లకీ ఆనందంగానే ఉంది. పెళ్లిపనులు మొదలుపెట్టారు.

చిన్నాన్న, నేనూ కలిసి శుభలేఖల్ని ప్రింటింగ్‌కి ప్రెస్‌లో ఇచ్చి వచ్చినరోజు లావణ్య మా ఇంటికి వచ్చి పిడుగులాంటి వార్త చెప్పింది. పెళ్లి తనకిష్టంలేదట. ఏ కారణం అయినా చెప్పి ఎలాగైనా పెళ్ళి క్యాన్సిల్ చేయించే బాధ్యత నాదేనంది.

కారణం అడిగితే... తనకిచ్చిన హామీలను పెళ్ళికి ముందు నిలబెట్టుకోలేని మనిషిని తన జీవితంలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించలేనని చెప్పింది.

మహేష్ ఎలాంటివాడో నాకు బాగా తెలుసు. ఆడపిల్లలతో మాట్లాడటానికే బెరుకుగా ఫీలవుతాడు. అలాంటివాడు అమ్మాయిలతో హద్దుమీరి ప్రవర్తించాడంటే ఎలా నమ్మగలను! ఎవరో చెప్పిన మాటలు విని సమస్యలు కొనితెచ్చుకోవద్దని లావణ్యకు హితవు చెప్పబోయాను.

"నేను నమ్మింది నా కళ్లనే గానీ చెవుల్ని కాదు! ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినందుకు నేనెంత మథనపడుతున్నానో అర్థం చేసుకో" అంది కళ్లనీళ్ళతో. ఫ్రెండు పెళ్లికి ఏలూరు వెళ్తున్నాననీ, నాలుగురోజుల్లో తను తిరిగివచ్చేసరికి ఎలాగైనా పెళ్ళి క్యాన్సిల్ అయ్యేట్లు చూడమని చెప్పింది.

నాకు మతిపోయినట్లయింది! మహేష్‌ని అడిగితే అసలు విషయం తెలుస్తుందని వాడి దగ్గరకు వెళ్లాను. కానీ వాడికిది తెలిసినట్లు లేదు. హుషారుగా పెళ్ళి కబుర్లు చెబుతున్న వాడిని ఎలా అడగాలో నాకర్థం కాలేదు. అందుకే ఇన్‌డైరెక్టుగా అడుగుదామని "ఈ మధ్య ఎవరైనా బంధువుల అమ్మాయిలు వచ్చారా?" అన్నాను విషయం కొంచెమైనా తెలుస్తుందని.

మహేష్ ఆశ్చర్యంగా "ఎందుకలా అడిగావ్...? లావణ్య కూడా మొన్న ఇలాగే అడిగింది. మా పెళ్ళిచూపుల రోజు అమ్మ రావటం తప్పించి ఈ ఇంటికి మరో ఆడప్రాణి రాలేదిప్పటి వరకూ... చివరకి పనిచేసేది కూడా అబ్బాయే కదా!" అన్నాడు.

నాకు ఏం మాట్లాడాలో తోచలేదు. ఏదో మాట్లాడి సందర్భం మళ్ళించానప్పటికి. విషయం పూర్తిగా లావణ్య ద్వారానే తెలుసుకోవాలని, తను ఊరునుంచి వచ్చే వరకూ టెన్షన్‌గా ఎదురు చూశాను. చిన్నాన్నశుభలేఖల్ని బంధువులికి పోస్టు చేయటం కూడా మొదలు పెట్టేశాడు మరి.

లావణ్య ఊరు నుంచి వచ్చాక విషయం ఏమిటో వివరంగా చెప్పమని అడిగాను. ముందు చెప్పటానికి తటపటాయించింది. కారణం పూర్తిగా తెలియకుండా పెళ్ళి పనులు ఇంతవరకూ వచ్చాక క్యాన్సిల్ చేయటమంటే తమాషా అనుకుంటున్నావా అని గట్టిగా కోప్పడేసరికి అప్పుడు చెప్పింది.

లావణ్య, ఇంకొక అమ్మాయీ కలిసి సినిమాకి వెళ్తూ ముందుగా షాపింగుకి వెళ్ళారు. ఆ మరునాడు మహేష్ బర్త్‌డే అని లావణ్యకు తెలుసు. ఫోన్ చేసి విషెస్ చెప్పాలని అనుకుంది. కానీ, ఆ అమ్మాయి ఏవో గ్రీటింగ్ కార్డ్స్ కొంటుంటే, తనూ ఓ బర్త్‌డే గ్రీటింగు కార్డు కొన్నది. అప్పుడు మహేష్ ఊళ్ళోలేడు. మరునాడు ఉదయం ట్రైనుకి వస్తాడని తెలుసు. అప్పటికి కార్డు ఇంట్లో ఉంటే, రాగానే చూస్తాడని, సినిమా నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు దారిలో మహేష్ ఇంటి దగ్గర ఆగి కార్డుని డోర్ కింద నుంచి లోపలకు వేయాలని లావణ్య అనుకుంది.

ఇన్‌స్టిట్యూట్‌కని తీసుకున్న బిల్డింగ్‌లోనే గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెనుక భాగంలో మహేష్ ఉంటాడు. రాత్రి పదిగంటలవేళ సినిమా నుంచి వస్తూ ఆటోని మహేష్ ఇంటిముందు ఆపి కార్డు పట్టుకుని లావణ్య వెనకవేపుకి వెళ్ళింది. రూములో లైటు వెలుగుతోంటే, మహేష్ ఊరునుంచి వచ్చేశాడు కాబోలనుకుంటూ తెరిచివున్న కిటికీ కర్టెను కొద్దిగా జరిపింది. లోపలి దృశ్యం చూసి చకితురాలైంది.

కుర్చీలో కూర్చున్న ఎవరో అమ్మాయికి బాగా దగ్గిరగా నిలబడి మహేష్ నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఇక వెంటనే అక్కడి నుంచి వచ్చేసింది కార్డ్ వేయకుండానే.

రెండు రోజులు అతను ఫోను చేసినా మాట్లాడకుండా తప్పించుకుంది. పెళ్లికి ముహూర్తం పెట్టిన దగ్గర్నుంచీ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లటం లేదు. ఇంట్లోనే ఉంటోంది. మూడోరోజు ఇక ఉండబట్టలేక అతన్ని "ఎవరైనా బంధువులమ్మాయిలు ఇంటికి వచ్చారా" అని నేనడిగినట్లే అడిగింది. నాకు చెప్పిన సమాధానమే మహేష్ లావణ్యకీ చెప్పాడు.

"అ అమ్మాయితో తనకిగల బంధుత్వమో, స్నేహమో... ఏమిటో చెప్పి ఉంటే నేనింత బాధపడేదాన్ని కాదేమో! నాకు ఇచ్చిన రెండో హామీని కూడా నిలబెట్టుకోలేకపోవటమే నన్ను మరీ బాధపెట్టింది. పైగా ఎవరూ రాలేదంటూ ఎటువంటి సంకోచంలేకుండా అంత నిర్భయంగా అబద్ధం చెప్పటం... నాకు మరీ ఆశ్చర్యంగా ఉంది. నిజాయతీ ముఖ్యం నాకు! అదిలేని మనిషిని రాజీపడి పెళ్ళి చేసుకోలేను. అసలు ఎలాంటివాడో తెలియకపోతే, అది వేరే సంగతి. కానీ తెలిశాక మనస్ఫూర్తిగా ఎలా ఒప్పుకోగలను...?" అంటూ లావణ్య బాధపడుతుంటే ఏం చెప్పాలో నాకు తోచలేదు.

మహేష్‌ని కలిసి విషయం చెప్పి వివరణ అడగాలనుకున్నా. ఆ రోజే ఆఫీసు పనిమీద బెంగుళూరు వెళ్ళాడట. మూడు రోజుల వరకూ రాడని తెలిసింది. ఫోనులో మాట్లాడే విషయం కాదాయె. ఏం చేస్తానిక... ముళ్ళమీద కూర్చున్నట్లుగా టెన్షనుతో వాడి రాక కోసం ఎదురుచూశాను.

మహేష్ రాగానే వెళ్ళి వాలిపోయి అడిగాను. వాడు అలాంటిదేంలేదంటూ ఆశ్చర్యపోయాడు. ఒకరేమో చూశామంటారు... ఇంకొకరు ఏమీలేదంటారు. ఇద్దరూ నమ్మదగినవాళ్ళే. కల్పితాలు చెప్పే రకాలు కాదు నా దృష్టిలో. మధ్యలో నాకు పిచ్చెక్కిపోతోంది.

కొంచెం సేపటి తరవాత మహేష్ ఏదో ఆలోచిస్తూ, ఎప్పుడూ... ఏమిటీ అంటూ మళ్ళీ వివరాలడిగాడు. ఆ తరవాత ఎవరికోగానీ ఫోనుచేసి వచ్చి "ఇప్పుడు లావణ్య ఇంట్లోనే ఉంటుందిగా... మనిద్దరం వెళ్దాం పద... ఆ అమ్మాయిని కూడా అక్కడికి రమ్మని అడ్రసు చెప్పాను" అన్నాడు.

నేను కంగారుగా "అలా బావుండదు. వద్దు..." అంటోంటే, వాడు "మరేం ఫర్వాలేదు. పద" అంటూ బయలుదేరించాడు.

లావణ్య మా ఎదురుగా తప్పదన్నట్లుగా ముభావంగా కూర్చుని ఏవో పొడిపొడి మాటలతో సమాధానాలు చెబుతోంది. మహేష్ పెదవులపై తారట్లాడుతున్న కొంటెనవ్వును చూస్తోంటే... విషయం ఏదో ఉందని నాకనిపించింది.

బయట బైక్ ఆగిన శబ్దం విని మహేష్ వెళ్లి ఆ వ్యక్తిని లోపలకు తీసుకువచ్చాడు.

లావణ్యకు పరిచయం చేస్తూ "నా ఫ్రెండు హరీందర్ సింగ్. ఆ రోజు నా రూములో నువ్వు చూసిన అమ్మాయి... మాయలేడి వీడే!" అన్నాడు చిరునవ్వుతో.

మేం ఆశ్చర్యంగా కళ్లప్పగించి చూస్తోంటే... అప్పుడు నిదానంగా చెప్పాడు.

వెళ్ళిన పని తొందరగానే పూర్తయిపోవటంతో ఈ రోజు మహేష్ రాత్రి ట్రైనుకే వచ్చేశాడు. ట్రైనులో కలిసిన ఫ్రెండుని ఆరాత్రికి ఇద్దరూ కబుర్లు చెప్పుకోవచ్చని ఇంటికి తీసుకువచ్చాడు. అతనిల్లు ఊరికి దూరంగా ఉన్న కాలనీలో ఉంది. అతను తన ముడివిప్పి తలస్నానం చేసి వచ్చి కుర్చీలో కూర్చుని జుట్టును ఆరబెట్టుకుంటూ ఉంటే... మహేష్ దువ్వెన అందిస్తూ 'ఇప్పుడు నిన్నెవరైనా వెనుకనుంచి చేస్తే అమ్మాయే అనుకుంటారు!' అన్నాడు నవ్వుతూ. అతను కూడా నవ్వుతూ 'ఒకసారి అలాగే జరిగింలే నేనూ, నా ఫ్రెండూ హోటల్ రూములో ఉన్నప్పుడు.. నా ఫ్రెండు కోసం వచ్చిన వాళ్లు నన్ను ఇలాంటి పోజులో చూసి చటుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయారు!' అన్నాడు. "ఇద్దరం పెద్దగా నవ్వుకున్నాం. అదీ సంగతి! బహుశా ఆ సమయంలోనే లావణ్య చూసి అమ్మాయనుకుని పొరపడిందన్న మాట!"

మహేష్ చెప్పింది వినగానే నాకూ నవ్వాగలేదు. మేం నవ్వుతుంటే లావణ్య సిగ్గుతో తలవాల్చుకుంది. మనసులోని వేదన అంతా మటుమాయం అయినట్లుగా మొహంలోకి వెలుగొచ్చింది.

హరీందర్ వెళ్లిపోయాక మహేష్ "ఈ పెళ్లి జరగాలంటే, లావణ్య కూడా నాకొక హామీ ఇవ్వాలి మరి!" అన్నాడు. మళ్లీ ఇదేమిటా అని నేను ఒక క్షణం అయోమయంలో పడిపోయాను.

"పెళ్ళి తరవాత... ఎప్పుడైనా ఏ విషయంలోనైనా అనుమానం కలిగితే, వెంటనే నన్నడిగి సందేహం తీర్చుకోవాలి గానీ మనసులో పెట్టుకుని మథనపడకూడదు!" అన్నాడు చిరునవ్వుతో.

లావణ్య ముసిముసి నవ్వులతో "అలాగే" అంటూ తలవూపింది.

"ఆ అమ్మాయి ఎవరూ?" అని లావణ్య మహేష్‌ని ఆ మరునాడే ఒక మాట అడిగితే, సమస్య ఇట్టే తీరిపోయేది. అనవసరమైన హైరానా తప్పి ఉండేది. భార్యాభర్తలుగానీ... స్నేహితులు గానీ, బంధువులుగానీ మనస్పర్థలు వచ్చినప్పుడు నిర్మొహమాటంగా మనసువిప్పి మాట్లాడుకుంటే, చాలా సమస్యలు తీరిపోతాయి.

* * * * *

సుధాకర్ చెప్పటం ముగించగానే మేం అందరం కూడా నవ్వుతూ అతని మాటలతో ఏకీభవించాం.

అప్పుడు గోపాల్ "ఇప్పుడు నాకనిపిస్తోంది. ముందుగా మా బావ కిషోర్ దగ్గరకు కాకినాడ వెళ్ళి, అతన్ని కూడా తీసుకుని వైజాగ్ వెళ్తాను అందరం కూర్చుని సమస్యలేమిటో అప్పుడు మాట్లాడుకుంటాం" అన్నాడు.

ఈనాడు ఆదివారం. 20, అక్టోబరు 2002.